

# అక్కడే ఆగక

**– మల్లాది వెంకట కృష్ణమూర్తి**

(ప్రారంభం)

I don't fix problems. I fix my thinking. Then the problems fix themselves

– Louise Lynn Hay (American motivational author)

**అది అనాదిగా మారనిది.**

దుర్భేద్యమైన కోటని కూడా పగలకొట్టుకుని అది లోపలకి ప్రవేశిస్తుంది.

అనుభవం మీదే అది అర్థమవుతుంది. దాన్ని అనుభవించే మనుషుల భావోద్వేగాలు, చర్యలు, అనుభూతులు, అనుభవాల సాంద్రత మాత్రం మారుతూంటుంది. దాని గురించి ఎంత కాల్పనిక సాహిత్యం రాసినా, ఇంకా రాయాల్సింది చాలా మిగిలే ఉంది. దాన్ని ఎంత తవ్వి తీసినా ఇంకా వస్తూనే ఉంటుంది. కారణం అదో తరగని గని. అది మంచివాళ్ళని చెడ్డవాళ్ళుగా, చెడ్డవాళ్ళని మంచివాళ్ళుగా మారుస్తుంది. కోటలోని రాజుని గుడిసెలోకి, గుడిసెలోని పేదవాడ్ని సింహాసనం మీదకి మార్చే శక్తి దానికి ఉంది. అది బతికిస్తుంది. చంపుతుంది. ఒకోసారి కొందర్ని చంపి, బతికించి, చస్తూ జీవించేలా చేస్తుంది.

అది ప్రేమ.

ప్రేమ పుట్టాక బర్త్ సర్టిఫికెట్ జారీ చేయబడదు. అది మరణించాక మాత్రం ఒకోసారి డెత్ సర్టిఫికెట్ జారీ చేయబడచ్చు. ప్రేమని ఎలా ఎదుర్కోవాలి? ఎలా దాన్ని ఓడించాలి? ప్రేమనించి మనిషి ఎలా తనని తాను రక్షించుకోవాలి?

అసలా అవకాశం ఉంటుందా?

హైదరాబాద్ రోడ్లమీద ఆ టేక్సీ శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వైపు వెళ్తోంది. అందులో స్మశాన నిశ్శబ్దం అలుముకుని ఉంది. ఆ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ మధ్య మధ్యలో ఆద్య ఏడుపు వినిపిస్తోంది. పక్కనే కూర్చున్న తల్లి ఆమె చేతిని మృదువుగా నిమురుతోంది. ఆవిడ కళ్ళల్లో కూడా నీళ్ళు. తండ్రి ఏభై నాలుగేళ్ళ సంజీవ మొహం మొటమొటలాడిస్తూ ముందు సీట్లో డ్రైవర్ పక్కన కూర్చున్నాడు. కూతురు, భార్య ప్రవర్ధనలవైపు చూడటానికి ఇష్టంలేనట్లుగా వెనక్కి తిరిగి చూడలేదు.

"విమానంలో అన్నం తినమ్మా! మూడు రోజులనించి నువ్వు మెతుకు అన్నం తినలేదు. పచ్చి మంచినీళ్ళు తప్ప కాఫీ కూడా తాగలేదు" టేక్సీ విమానాశ్రయం ఎప్రోచ్ రోడ్ చేరుకున్నాక ప్రవర్ధన కూతురి చుబుకం నిమురుతూ చెప్పింది. ఏడుస్తున్న ఆద్య తల్లి చేతిని పక్కకి తోసేసింది.

"ఇంటర్నేషనలా సర్?" టేక్సీ ఓ సర్కిల్‌ని చేరుకోగానే అంతదాకా మౌనంగా ఉన్న టేక్సీ డ్రైవర్ అడిగాడు.

"డొమెస్టిక్" సంజీవ చెప్పాడు.

సంజీవ మొబైల్ మోగింది. అతని పెద్ద కూతురు చైత్రనించి.

"ఏర్‌పోర్ట్‌కి చేరుకున్నారా నాన్నా? నువ్వు డ్రైవ్ చేయడంలేదుగా? కేబ్‌లోనే వెళ్ళారా?" అవతలనించి చైత్ర అడిగింది.

"అవును. ఈ పరిస్థితుల్లో నన్ను కారు డ్రైవ్ చేయద్దన్నావుగా? దాదాపుగా వచ్చేసాం. అమ్మతో మాట్లాడు" ఆయన మాట్లాడి దాన్ని ప్రవర్ధనకి ఇచ్చాడు.

"దాని హేండ్ బేగ్ చెక్ చేసావా? నెయిల్ పాలిష్ బాటిల్ లేదుగా?" తల్లి కంఠం విన్నాక చైత్ర అడిగింది.

"లేదు."

"దానికోసారి ఇవ్వు."

"అక్క" తల్లి దాన్ని ఆద్యకి ఇచ్చి చెప్పింది.

దాన్ని ఆద్య అయిష్టంగానే అందుకుంది.

"హలో డాలీ" చైత్ర కంఠం ప్రేమగా వినిపించింది.

ఆద్యని చైత్ర మాత్రమే పిలిచే ముద్దుపేరు డాలీ.

"హలో అక్కా."

"నాకు సెలవు దొరికితే నేను ఆక్రాకి వచ్చి నిన్ను రిసీవ్ చేసుకునేదాన్ని. కాని ఇంపార్టెంట్ మీటింగ్ ఉంది. కాబట్టి రావడంలేదు. చెప్పేది మరోసారి జాగ్రత్తగా విను. ఘనాకాదు. ఈ దేశాన్ని ఘానా అంటారు. ఘా...ఆ. ఆక్రలో ఇమిగ్రేషన్‌లో ఎలాంటి సమస్యా ఉండదు. అక్కని చూడటానికి వచ్చానని చెప్పు. బయటకి వచ్చాక పక్కనే నడిచి వెళ్ళేంత దూరంలో నేషనల్ ఏర్‌పోర్ట్ ఉంటుంది. డౌటుంటే ఎవర్నైనా అడుగు. ఈ దేశంలో అంతా ఇంగ్లీష్ మాట్లాడతారు కాబట్టి భాషా సమస్య ఉండదు. సామాను ట్రాలీలో వేసుకుని అక్కడికి తీసుకెళ్ళు. మోసుకెళ్ళక. నీకు ఆక్రానించి టకరోడికి విమానం ఉంటుంది. ఎయిర్‌పోర్ట్‌లో ఎవర్ని అడిగినా సెల్ ఫోన్ ఇస్తారు. నేషనల్ ఏర్‌పోర్ట్‌కి చేరుకున్నాక నాకు ఫోన్ చేసి అక్కడికి చేరుకున్నావని చెప్పు. నా ఎడ్రస్, ఫోన్ నంబర్ ని హేండ్ బేగ్‌లో కాగితంలో రాసి ఉంచమని అమ్మకి చెప్పాను. ఉంచాను అంది. ఉంచిందిగా?"

"ఊ."

"గుడ్. మొబైల్‌ని నమ్మకు. దాని బేటరీ డెడ్ అయినా, పోయినా, ఏ కారణంగానైనా అది పనిచేయకపోయినా కష్టం. నేను పంపిన ఇన్‌స్ట్రక్షన్స్ ప్రింటౌట్ నాన్న నీకు ఇచ్చారుగా?"

"ఆ."

"గుడ్. అది సెల్ఫ్ ఎక్స్‌ప్లనేటరీ. ఇక్కడికి చేరేదాకా దాన్ని చదువుతూ విమానం మిస్ అవకుండా, దారి తప్పకుండా రా. అర్ధమౌతోందా?

"ఊ"

"ఒకోసారి సహారా ఎడారిలో ఇసుక తుఫాను చెలరేగితే ఆకాశంనిండా దుమ్ము అలుముకుని ఆక్రానించి టకరోడికి వెళ్ళే విమానం రద్దవుతూంటుంది. వెదర్ రిపోర్ట్ చెక్ చేసాను. ఆ అవకాశం లేదు. ఒకవేళ అలా జరిగితే నీ ఆక్రా ఏర్‌పోర్ట్‌నించి మా ఊరుకి టేక్సీని అరేంజ్ చేస్తాను. టేక్సీ డ్రైవర్ విమానాశ్రయంలో నీ దగ్గరకి వచ్చి నా పేరు చెప్తాడు. ఇదంతా నీకిచ్చిన ఆ ప్రింటౌట్‌లో ఉంది. గాటిట్?"

"ఊ."

"ఎనీ క్వశ్చన్స్?"

"లేవు.

"సరే. రాత్రి ఢిల్లీలో దిగినపప్పటినించి ప్రింటౌట్‌లో రాసింది ఫాలో అవు. టెన్నిస్ బాల్ని హేండ్ బేగ్‌లో ఉంచుకో. చేతులు, ఏంకిల్స్, తొడలు, భుజాలు మెడ వెనక, కాళ్ళు, మణికట్లమీద దాన్ని ఉంచి, జెంటిల్ ప్రెషర్‌తో రోల్ చెయ్యి. ఇట్ విల్ ప్రివెంట్ ట్రావెల్ ఫేటిగ్. ఫోన్ మళ్ళీ అమ్మకివ్వు."

తల్లితో రెండు నిమిషాలు మాట్లాడి చైత్ర లైన్ కట్ చేసింది. ప్రవర్ధననించి సంజీవ ఫోన్‌ని తీసుకున్నాక ఆమె కూతుర్ని హెచ్చరించింది.

"నేను చెప్పిందంతా గుర్తుందిగా? ఇక్కడలా అక్క చిక్కుల్లో పడే పిచ్చి పనులేం అక్కడ చేయకు. అక్క కనపడగానే నువ్వు జాగ్రత్తగా చేరినట్లు ముందు నాకు ఫోన్ చేయమని చెప్పు. అప్పటిదాకా మా ఇద్దరికీ ఆదుర్దా."

టేక్సీ రాజీవ్ గాంధీ విమానాశ్రయం రేంప్ ఎక్కి విమానాశ్రయంలోని మొదటి గేట్ పక్కన ఆగింది. డ్రైవర్ దిగి డిక్కీ తలుపు తెరచి లోపలి ఓ పెద్ద సూట్‌కేస్‌ని, ఓ కేరీ బేగ్‌ని పేవ్‌మెంట్‌మీద ఉంచాడు. ఈలోగా సంజీవ వెళ్ళి ట్రాలీని తోసుకొచ్చాడు. డ్రైవర్‌కి డబ్బిచ్చి పంపించి వాటిని ట్రాలీలో ఉంచాడు. గేట్ వైపు బయల్దేరబోయే ముందు కూతురు వినేలా సంజీవ భార్యకి చెప్పాడు.

"పాస్‌పోర్ట్, టిక్కెట్ అక్కయ్య అడ్రస్ చూపించమను."

ఏడుస్తున్న ఆద్యలో స్పందన లేదు.

"నిన్నే ప్రవం" కసిరాడు.

తల్లి కూతురి హేండ్‌బేగ్ తెరిచి అందులోంచి వాటిని తీసి భర్తకి చూపించింది. ఆయన జేబులోంచి ఓ కవర్ తీసి భార్యకి ఇచ్చాడు.

"ఐదు వేలు. లోపల కొనడానికి, తిరిగి వచ్చేప్పుడు ఏ కారణంగానైనా మేము రాకపోతే టేక్సీకి. మేం రాకుండా ఉండం. ఏ కారణంగానైనా అన్నానంతే" కూతురితో కఠినంగా చెప్పాడు.

ప్రవర్ధన కూతురి హేండ్‌బాగ్‌లో ఆ కవర్ని ఉంచాక ఓ పెన్ ఇచ్చి చెప్పాడు.

"ఇది దిగాక ఇమిగ్రేషన్ ఫాం నింపడానికి. ఆ ఫాంలో అక్కయ్య ఎడ్రస్ తప్పనిసరిగా రాయాలి. ఇకపదండి."

అంతా గేట్ వైపు కదిలారు. డిపార్చర్ భవంతికి, రోడ్‌కి మధ్య ఉన్న కాలి వంతెన మీది గేట్ దగ్గర ఉన్న యూనిఫాంలోని సెక్యూరిటీ గార్డ్ ముగ్గురు మనుషుల్ని, ట్రాలీలోని ఒకే ప్రయాణికుడి సామాన్ని చూసి అడిగాడు.

"మీలో పేసెంజెర్ ఎవరు?"

"ఈ ఇద్దరు" సంజీవ అబద్ధం చెప్పాడు.

ముందే ఆయన భార్యకి ఇది చెప్పి ఉండటంతో ఆవిడ ట్రాలీని అందుకుని భర్తతో చెప్పింది.

"సరే. వెళ్ళొస్తాం."

ఆవిడ ఓ చేత్తో ట్రాలీని, మరో చేత్తో కూతురు చేతిని పట్టుకుని ముందుకి నడిచి ఎదురుగా ఉన్న విమానాశ్రయం ఎంట్రన్స్ గేట్ దగ్గర ఆగింది. సంజీవ సెల్ ఫోన్ ఈసి 'ఉబర్ టేక్సీ అందుబాటులో ఉందా? ఎంతవుతుంది?' అని చూసుకున్నాడు. తర్వాత్ బస్ ఎప్పుడు ఉందో తెలుసుకోడానికి ఏర్‌పోర్ట్ షటిల్ బస్ స్టాప్ వైపు నడిచాడు.

గేట్ దగ్గరకి వెళ్ళాక తల్లి ఆద్యతో చెప్పింది.

"జాగ్రత్త నాన్నా! ఢిల్లీలో ఎక్కాక మధ్యలో ఆడిస్ అబాబాలో విమానం మారాలి. అలర్ట్‌గా ఉండి దాన్ని మిస్ కాకుండా అక్కడ అక్రాకి వెళ్ళే విమానం ఎక్కు. ఏర్‌పోర్ట్‌లో ఏదైనా తిని తాగు. లేదా దారిలో శోష రావచ్చు. అక్కడంతా పరాయివాళ్ళే తప్ప నిన్ను ఇంట్లోలా చూసుకోడానికి ఎవరూ ఉండరు. నేను కూడా వస్తానంటే అక్క రావద్దంది."

ఆద్య తల్లి మాటల్ని నిశ్శబ్దంగా వింటోంది. ఆమె కళ్ళనించి ధారగ కారే కన్నీళ్ళని చూసేవారికి ఆమె గుండెల్లో విచారం తీవ్రంగా గూడు కట్టుకుందన్న సంగతి తెలిసిపోతోంది. చుట్టుపక్కలవాళ్ళు ఆమె తల్లితండ్రులని వదిలి దూరంగా వెళ్తున్నందుకు ఏడుస్తోందని భ్రమపడ్డారు.

ఏర్‌పోర్ట్ మెయిన్ బిల్డింగ్ ఎంట్రన్స్ దగ్గరున ఓ సెక్యూరిటీ గార్డ్ ఆద్య పాస్‌పోర్ట్, టికెట్ చూసి హిందీలో ప్రవర్ధనంతో చెప్పాడు.

"వెళ్ళండి. మీరు దారికి అడ్డుగా ఉన్నారు."

"సరే వెళ్ళు. టైమైంది. నాన్న దీన్ని నీకు ఇక్కడే ఇవ్వమన్నారు. అతనితో మాట్లాడద్దని కూడా నాన్న చెప్పమన్నారు. లేదా నాన్నమీద ఒట్టే. లోపల నీకు ప్రొసీజర్ తెలుసుగా? అక్కయ్య పంపిన సమాచారం ప్రింటౌట్ ఫాలో అవు. లేదా ఎవర్నైనా అడుగు. క్షేమంగా వెళ్ళి లాభంగా తిరిగిరా నాన్నా" ఆవిడ ఆద్యకి ఆమె మొబైల్ ఇచ్చి, ఏడుస్తూ ఆద్య చేతిని గట్టిగా పట్టుకుని చెప్పింది.

ఆద్య కొద్ది క్షణాల తర్వాత ఆ చేతిని విడిపించుకుని గేట్ వైపు వెళ్తూ చెప్పింది.

"నా శవం తప్ప నేను తిరిగిరాను."

"అదేం మాటే పిచ్చి తల్లి. అలా అనకు" ఆవిడ డగ్గుత్తికగా చెప్పింది.

ఆద్య ట్రాలీతో గేట్‌కి ముందున్న క్యూలో నిలబడింది. కూతురు ఒక్కసారైనా వెనక్కి తిరిగి చూస్తుందని ఎదురుచూసింది కాని ఆద్య చూడలేదు.

ప్రవర్ధన కదలకుండా ఓ వైపు నిలబడి అద్దాలగోడలోంచి తన రెండో కూతురు కనుమరుగయ్యేదాకా చూసింది. ఆద్య కార్చే కన్నీరుని చూసిన చుట్టుపక్కలవారు చాలా విచారంగా ఉన్న మనిషిని చూస్తున్నామని అనుకున్నారు.

"జాగ్రత్తగా వెళ్ళిందా?" బయటకి వచ్చిన భార్యని సంజీవ అడిగాడు.

ఆవిడ తల ఊపింది.

"కళ్ళు తుడుచుకో. పద. బస్ రెడీగా ఉంది."

ఆయన భార్య చేతిని పట్టుకుని బయటికి తీసుకెళ్ళబోయాడు.

"మళ్ళీ బయటకి వచ్చేస్తుందేమో? విమానం డిపార్చర్ టైం దాకా ఉందాం. ఇంటికి వెళ్ళి చేసేదేం లేదుగా?"

"ఓసారి లోపలకి వెళ్ళాక వీసా, మెడికల్ ఎమర్జన్సీ సమస్యలు ఉంటే తప్ప ఇంక బయటకి రానివ్వరు. పద."

ఇద్దరూ బయటకి నడిచి పావుగంట తర్వాత షటిల్ బస్ ఎక్కి తమ ఇంటికి బయల్దేరారు.

"అది క్షేమంగా వెళ్తుందంటారా?" ఆవిడకి ధైర్యం చెప్పాడు.

కొద్దిసేపట్లో ఆయన కూడా ఒక తన దుఃఖాన్ని కంట్రోల్ చేసుకోలేకపోయాడు. ఒళ్ళో తల ఉంచుకున్న ఆయన భుజాలు ఎగిరెగిరి పడసాగాయి.

"ఎంతైనా కన్న కడుపు. ఊరుకోండి" ఆవిడ భర్త భుజం మీద ఓదార్పుగా తడుతూ చెప్పింది. ఒకరిద్దరు వీరివంకే ఆసక్తిగా చూడసాగారు. వారి దుఃఖానికి, ఆద్య హైద్రాబాద్‌నించి తన అక్క దగ్గరకి వెళ్ళాల్సిన ఆవశ్యకతకి కొన్ని రోజులముందే బీజం పడింది.

# 2

కాలేజ్‌నించి ఇంటికి వాడిపోయిన మొహంతో వచ్చిన ఆద్య తల్లిని అడిగింది.

"వేడి వేడి స్ట్రాంగ్ కాఫీ ఇవ్వమ్మా."

ఆద్య హేండ్ బేగ్‌ని అలమరలోని కొక్కేనికి తగిలించి, తలుపు మూసి వెళ్ళి తన గదిలో పడుకోవడం గమనించిన ప్రవర్ధనకి కొద్దిగా ఆశ్చర్యం వేసింది. లోపలకి వెళ్ళి అడిగింది.

"ఏమిటే? ఏమైంది?"

"ఏం కాలేదు కాని కాస్త కాఫీ ఇవ్వమ్మా మహాతల్లీ" ఆద్య కోపంగా అరిచింది.

ఆవిడ వంటగదిలోకి వెళ్ళి రెండు కప్పుల్లో కాఫీ కలిపి కూతురు గదిలోకి వెళ్ళి చెప్పింది.

"లే. తాగు"

ఆద్య లేచి కాఫీ కప్పుని మంచం కింద ఉంచి మళ్ళీ పడుకుని కళ్ళు మూసుకుంది.

"ఏమైందే?" ఆవిడ అనునయంగా కూతురి నుదుటిమీద చేతిని వేసి అడిగింది.

"నాన్న మనింటిని జూబ్లీ హిల్స్‌లో ఎందుకు కట్టలేదు?" విసురుగా అడిగింది.

"నాన్న తాహతుకి ఇక్కడే కట్టగలిగారు. ఐనా జూబ్లీ హిల్స్‌లో ఇల్లు కట్టాలని నాన్నెప్పుడూ అనుకోలేదు. ఐతే?" చురుగ్గా అడిగింది.

"నాన్న ఫ్రెండ్ కమల్‌హాసన్‌గారు కట్టుకోలేదా?" బాధగా అడిగింది.

"ఆయనకి జర్నలిస్ట్ కాలనీలో ప్లాట్ ఎలాటైంది. నాన్న జర్నలిస్ట్ కాదు. ఐరన్ ఫౌండ్రీలో మేనేజర్. అసలు నీకు వచ్చిన సమస్యేమిటో చెప్పు" ప్రవర్ధన కొంచెం చిరాగ్గా అడిగింది.

"ఏం లేదు మహా తల్లీ. నువ్వు కాసేపు అవతలకి వెళ్తావా?" ఆద్య అరిచింది.

"సరే. నీకు చెప్పాలనిపించినప్పుడే చెప్పు" అహం దెబ్బతిన్నఆవిడ బయటకి వెళ్ళిపోయింది.

ప్రవర్ధనకి కూతురు ప్రవర్తన ఆదుర్దాగా ఉంది. ఆద్య పంతొమ్మిదేళ్ళలో అంతదాకా ఎన్నడూ అలా ప్రవర్తించక పోవడంతో ఆవిడ మనసాగక పది నిమిషాల తర్వాత వచ్చి ఆద్య పక్కన కూర్చుని మళ్ళీ అడిగింది.

"ఏమైనా చెప్తావా?"

ఆద్య జవాబు చెప్పలేదు.

"ఏమిటే? కాలేజీలో ఏం జరిగింది?"

"ఏం జరగలేదు."

"మరి? ఎవరైనా నిన్ను ఈవ్ టీజ్ చేసారా?"

"అలాంటిదేం లేదు."

"మేం గుజరాత్ లో ద్వారకా, గిర్నార్లకి వెళ్తూ రమ్మంటే రానన్నావు. నువ్వు రానంటేనే కదా మేమిద్దరం వెళ్ళింది."

"అదే కాదు."

"మరి? ఇంకేమిటి?"

వాట్సప్ మెసేజ్ వచ్చిన బీప్ విని ఆద్య ఆత్రంగా ఫోన్ అందుకని వచ్చిన మెసేజ్‌ని చదివింది. వెంటనే గబగబా ఏదో టైప్ చేసి పంపి భోరున ఏడవసాగింది. దాన్ని పక్కన పెట్టి ఆమె కళ్ళుమూసుకోగానే తల్లి దాన్ని అందుకుని చదివింది.

'సారీ! నేను నిన్ను ప్రేమిస్తున్నాను అన్నది నిజం. కాని మన మధ్య చాలా తేడా ఉంది. కాబట్టి పెళ్ళి చేసుకోలేను. డేడ్ సేస్ నో+నో = నాట్ ఎస్. ఏ థౌజండ్ టైమ్స్ నో ఫ్రం మీ. ఇట్ ష్యూర్ ఈజ్ ఏ బ్రేకప్. బై '

దాని కింద ఆద్య 'నాకు ఆత్మహత్యే గతి' అని టైప్ చేసి పంపింది.

ఆవిడ దాన్ని చదువుతూండగానే దానికి రిప్లై వచ్చింది.

'నీ భావోద్వేగాలకి మార్కెట్ లేదు. కాబట్టి వాటిని ఇక్కడ ప్రదర్శించకు.'

ఆవిడ తెల్లబోయింది.

"ఈ మెసేజ్‌లు ఏమిటి? జినేంద్ర ఎవరే?" అడిగింది.

"నా పర్మిషన్ లేకుండా నా ఫోన్‌లో మెసేజెస్ ఎందుకు చదివావు?" ఆద్య ఉగ్రంగా అడిగింది.

"జినేంద్ర ఎవరు? దేనికి థౌజండ్. టైమ్స్ నో చెప్పాడు?" ఆవిడ సీరియస్‌గా చూస్తూ అడిగింది.

ఆద్య జవాబు చెప్పలేదు.

"ఏమిటి? ప్రేమా? ఇంతదాకా నాకు చెప్పనేలేదే? లే. ముందు లేచి కూర్చో" ఆవిడ మరోసారి నివ్వెరపోతూ చెప్పింది.

ఆద్య జవాబు చెప్పలేదు.

"ఎవరతను?"

జవాబు లేదు.

"క్లాస్‌మేటా? బదులు చెప్పేడవ్వే నా తల్లీ"

"సీనియర్."

"మాతో గుజరాత్‌కి రాకపోవడానికి కారణం అతనేనా?"

మళ్ళీ ఆద్య మౌనంగా ఉండిపోయింది.

"ఐతే మీ నాన్న అనుమానం నిజం చేసావు. నువ్వు నాలుగు రోజులుగా సరిగ్గా లేవని నాన్న పసికట్టారు. అతను దేనికి నో చెప్పాడు?"

"మా పెళ్ళికి."

"కారణం?"

"డబ్బు."

"వాళ్ళు డబ్బున్నవాళ్ళా?"

"అవును. అది నేను పట్టించుకోలేదు. "

మళ్ళీ భోరున ఏడవసాగింది.

"ఏడుపు ఆపి అసలేం జరిగిందో వివరగా చెప్పు."

ఆవిడ వంట చేస్తూ మధ్య మధ్యలో వచ్చి ఏకధాటిగా ఏడ్చే కూతుర్ని అడుగుతూ మొత్తానికి జరిగింది తెలుసుకుంది. ఆద్య ఫ్రెండ్ హవిష్య తన పుట్టినరోజున ఇచ్చిన పార్టీలో తన కజిన్ జినేంద్రని ఆద్యకి పరిచయం చేసింది. అతను ఆమె ఫోన్ నంబర్ అడిగి తీసుకున్నాడు. మొదట్లో ఆద్య అతని మెసేజెస్‌కి స్పందించలేదు. అతను పరిచయమైన రెండు రోజులకి తెల్లవారుఝామున బాత్‌రూంకి వెళ్ళడానికి మెలకువ వచ్చినప్పుడు అతన్నించి వచ్చిన వాట్సప్ మెసేజ్‌ని చదివింది.

లస్ట్ షేడ్స్ ఆఫ్టర్ బ్రేక్‌ఫాస్ట్. లవ్ లాస్ట్స్ ఫరెవర్.

మర్నాడు కూడా మరోటి వచ్చింది .ఐ యాం ఏ హోప్‌లెస్ రొమాంటిక్ విత్ ఏ డర్టీ మైండ్.

నిత్యం అలాంటిది ఒకోటి రాసాగింది. టీనేజర్లకి నచ్చేవి, ఆత్మీయంగా అనిపించే అవి ఆసక్తిగా, వినోదంగా ఉండటంతో వాటిని చదివి పడుకునేది. ప్రతి అర్ధరాతి ఓ మెసేజ్ పంపేవాడు. దాదాపు పది మెసేజెస్ తర్వాత జవాబు ఇచ్చింది. వాళ్ళు అరడజను సార్లు కాఫీ షాప్‌లో కలుసుకున్నారు. తను ఒక్కడే కొడుకని, తన తండ్రి బిల్డర్ అని చెప్పాడు.

ప్రవర్ధన వాట్సప్‌లో వెనక్కి వెళ్ళి కొన్ని మెసేజెస్‌ని చదివింది.

ది డిజైర్ ఆఫ్ లవ్ ఈజ్ టు గివ్. ది డిజైర్ ఆఫ్ లస్ట్ ఈజ్ టు టేక్.

నథింగ్ కంపేర్స్ టు యు.

ఐ సెర్చ్‌డ్ ఫర్ యు ఇన్ మై పాస్ట్ లైఫ్.

యు రూల్ మై హార్ట్.

మై ఐడియల్ వెయిట్ ఈజ్ యువర్స్ ఆన్‌మైన్.

నా మంచం పక్కన నా బట్టలమీది నీ బట్టలు నా బెడ్ రూంకే ఎంతో అలంకారం.

ఐ లవ్ ఎవ్విరి ఇంచ్ ఆఫ్ యువర్ స్కిన్.

నా నిద్రకి నువ్వే శత్రువు. నన్ను నిద్రపోనివ్వవు కదా.

"ఇలా ఎంతకాలం నుంచి సాగుతోంది?" ఆవిడ ఆశ్చర్యంగా అడిగింది.

"ఏడెనిమిది నెలలుగా."

"మరి నాకు ఎన్నడూ చెప్పలేదా?"

"తిడతావని."

"ఎందుకు బ్రేకప్‌దాకా వెళ్ళింది?"

"అతనికి పెళ్ళి కుదిరిందని నిన్న నా ఫ్రెండ్ చెప్పింది. నేను నమ్మలేదు. నిజమా అని అడిగితే అవునన్నాడు" మళ్ళీ ఏడవసాగింది.

"అంటే నిన్ను చేసుకుంటానని బాగా నమ్మించాడన్నమాట?"

"అవును."

"ఏం అభ్యంతరం చెప్పాడు?"

"జినేంద్ర వాళ్ళ నాన్న ఒప్పుకోలేదు. నెలకి కనీసం పది లక్షలు సంపాదించలేనివాడి కూతుర్ని తన కోడలుగా ఒప్పుకోలేరట. తమ కమ్యూనిటీలోనే ఓ ఫార్మాస్యూటికల్ కంపెనీ యజమాని కూతురుతో పెళ్ళి కుదిర్చాడని చెప్పాడు."

"జినేంద్ర తండ్రిని ఎదిరించలేడా?"

"ఊహు. అదే జరిగితే తండ్రి బయటకి పంపుతాడని, తను బికారి అవుతానని భయమని చెప్పాడు. అప్పుడు తన చుట్టాలు కూడా దగ్గరకి రానీరని భయమట."

"ఇదంతా ఎప్పుడు జరిగింది?"

"ఇవాళ మధ్యాహ్నం. కాఫీ షాప్‌లో రెండు గంటలు మాట్లాడుకున్నాం."

"క్లాస్‌కి దుమ్మా కొట్టావన్నమాట."

"జూబ్లీ హిల్స్‌లో ఇల్లున్నవాళ్ళనే వాళ్ళ నాన్న కోడలుగా ఇష్టపడతాడని చెప్పాడు. హైద్రాబాద్‌లో డబ్బున్న వాళ్ళంతా అక్కడే ఉంటారుగా. నన్ను పెళ్ళి చేసుకుంటానని ఎప్పుడూ మాట ఇవ్వలేదని, కావాలంటే తన మెసేజెస్‌ని చదువుకోమని, తను మోసం చేయలేదని, మా మధ్య ఉన్నది స్నేహం మాత్రమే అని చెప్పాడు. అతను నన్ను పెళ్ళిచేసుకుంటానని ఓరల్‌గా తప్ప రిటెన్‌గా ఎక్కడా కమిటవలేదు" ఆద్య వెక్కుతూ చెప్పింది.

"స్నేహంలో బెడ్‌రూం మెసేజెస్‌లు పంపుతారా అని అడిగావా మరి?" ఆవిడ కోపంగా అడిగింది.

ఆద్య మళ్ళీ ఏడవసాగింది. ప్రవర్ధన చిన్నగా నిట్టూర్చి చెప్పింది.

"ఏడవక. అలాంటి ఇంటికి కోడలుగా వెళ్ళడం నీకు మంచిదికాదు. పెళ్ళికి ముందే బ్రేకప్ మంచింది. నువ్వు లేకుండా జీవించగలిగేవారితో, వారు లేకుండా జీవించడంలో గొప్ప ఆనందం ఉందమ్మా. దానికోసం నువ్వు ఇంతగా కుమిలిపోవాల్సిన అవసరంలేదు."

ఆవిడ మనసు మనసులో లేదు. కొద్దిసేపాగి మళ్ళీ కూతురు గదిలోకి వెళ్ళి చెప్పింది.

"నాన్నొచ్చారు. లే. లేచి మొహం కడుక్కో. నాన్నకి ఇదంతా తెలిస్తే బావుండదు."

కాని ఆద్య ఏడుపుని ఆపుకోలేక ఏడుస్తూనే ఉంది. కన్నీళ్ళు ధారాపాతంగా కారుతూనే ఉన్నాయి. తండ్రంటే గౌరవం గల ఆద్య ఆ ఏడుపుని కంట్రోల్ చేసుకోలేకపోవడం ఆవిడని ఇంకా ఆశ్చర్యపరిచింది.

"ఆపు.  నాన్న నువ్వు ఎక్కడని అడిగారు. ఒంట్లో బాలేదని అబద్ధం చెప్పాల్సి వస్తుంది. అప్పుడు నాన్నే వచ్చి చూస్తారు. కాబట్టి లే" కాసేపాగి వచ్చి చెప్పింది.

గంటలో రెండుసార్లు సంజీవ కూతురి గురించి అడిగితే చివరికి ఆవిడ చెప్పింది.

"ఆద్యకి ఒంట్లో బాలేదు."

వెంటనే ఆయన ఆ గదిలోకి వచ్చి అడిగాడు.

"ఏమ్మా? ఏమైంది? అరె! మొహం అలా ఉబ్బిందేమిటి? ఓపిక ఉందా? డాక్టర్ దగ్గరకి వెళ్దామా?"

ఆయన బయటకి వచ్చి ఆద్య ఏడుపు గురించి ప్రవర్ధనని అడిగితే ఆవిడ వెంటనే జవాబు చెప్పలేదు. కాసేపాగి మొత్తం చెప్పింది. ఆయన మొహం కందగడ్డైంది.

"ఈ కాలం పిల్లలు ఇంట్లో పెద్దలకి తెలీకుండా ఇంత గ్రంధం జరుపుతారని విన్నాను. మొదటిసారి మనకి అనుభవంలోకి వచ్చింది" ఆయన బాధగా చెప్పాడు.

"నేనూ పసి కట్టలేకపోయాను."

"చైత్ర ఎంత బుద్ధిమంతురాలో అనిపిస్తోంది."

"తప్పు. పోల్చకండి. పాప్‌కార్న్‌ని ఒకే గిన్నెలో, ఒకే వేడిలో, ఒకే వెన్నలో వేయిస్తాము. గింజలన్నీ ఒకేసారి విచ్చుకోవు. దాని వంతు వచ్చినప్పుడు ప్రతీగింజా పాపవుతుంది" ప్రవర్ధన మందలింపుగా చెప్పింది.

"నువ్వు పిల్లలమీద ఈగ వాలనివ్వవు. అందుకే ఆద్య ఇలా తయారైంది. ఐనా ఇంట్లో ఇంత జరుగుతున్నా నాకు చెప్పలేదే?" అడిగాడు.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments